క్లుప్తంగా

తాగునీరు వృథా



వృథాగా పోతున్న తాగునీరు

ఆనందపురం : మండలంలోని ఆనందపురం సాయిబాబా గుడికి సమీపంలో గోస్తనీ వాటర్ వర్క్స్ పైప్‌లైను లీకై తాగునీరు వృథాగా పోతోంది. సాయిబాబా గుడికి సమీపంలో గల మామిడితోటలో నుంచి విశాఖకు మంచినీటి సరఫరా చేసే గోస్తనీ పైప్‌లైను ఉంది. అక్కడ పైపు దెబ్బతిని చాలా నీరు వృథాగా పోతోంది. చాలా రోజులుగా నీరు వృథా అవుతోందని, అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి వృథాకు అడ్డుకట్టు వేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రేక్షకులకు 'దసరా' టికెట్ల సొమ్ము వాపసు

తగరపువలస: స్థానిక తాతా థియేటర్‌లో ఆదివారం సాయంత్రం ఫస్ట్ షో ప్రదర్శించిన దసరా సినిమా సాంకేతిక కారణాలతో నిలిచి పోయింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సమాచారం ప్రకారం షో ప్రారంభమైన అరగం టకే ప్రొజెక్టర్‌లో సమస్య కారణంగా ప్రదర్శన నిలిచిపోవడంతో ప్రేక్షకులు ఆందోళనకు దిగారు. దీంతో థియేటర్ యాజమాన్యం బుకింగ్‌లో కొనుగోలు చేసిన వారితోపాటు వాహనాల పార్కింగ్ సొమ్మును వెంటనే వాపసు చేసింది. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి తిరిగి వారి ఖాతాలకు సొమ్ము జమ చేస్తున్నారు. ప్రేక్షకులకు సొమ్ము వాపసు చేస్తుండగానే సాంకేతిక సమస్య సరిచేసినా వారు వెళ్లిపోవడంతో షో నిలిపివేశారు. సెకెండ్ షో నుంచి యధావిధిగా ప్రదర్శన సాగింది. ప్రదర్శన నిలిచిపోయిన కారణంగా డిస్ట్రిబ్యూటర్‌కు అద్దె, విద్యుత్ బిల్లులకు సంబంధించి నష్టం వాటిల్లినట్టు తెలిపారు.

సుందరంగా డంపింగ్‌యార్డు ముఖద్వారం



హైవేని ఆనుకుని కాపులుప్పాడ డంపింగ్ యార్డు ముఖద్వారం వద్ద సుందరంగా ఆర్చి

మధురవాడ: నగరంలో నిర్వహించిన జి – 20 సదస్సు కారణంగా అన్ని ప్రాంతాలు సుందరంగా ముస్తాబు చేశారు. ఇందులో భాగంగా జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డు పరిసరాలు మరింత సుందరంగా తయారు చేశారు. జాతీయ రహదారి నుంచి డంపింగ్ యార్డుకు వెళ్లే మార్గాన్ని బీటీ రోడ్డుగా మార్చి ప్రవేశం వద్ద వేస్ట్ టు వెల్త్ కాంప్లెక్స్ అని ఏర్పాటు చేసిన ముఖ ద్వారం విశేషంగా ఆకట్టుకుంటోంది.

నైపుణ్యాలు పెంచుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కుప్పిలి శేషవర్ధన్

కొమ్మాది: విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని బ్రాండెక్స్ హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ కుప్పిలి శేషవర్ధన్ సూచించారు. రుషికొండలో గల గాయత్రి విద్యా పరిషత్ పీజీ, డిగ్రీ, ఇంజినీరింగు కళాశాలలో సోమవారం ప్రారంభమైన తరంగ్ 2కే 23 కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ చదువుతున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని, కృషి, పట్టుదలతో విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో హయింట్ గ్రిడ్ విన్‌స్టన్ ఎస్‌కే ఆడమ్స్, ప్రొఫెసర్లు దక్షిణామూర్తి, రాజగణపతి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం

నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలకు 21 మంది గైర్హాజరు

తగరపువలస: భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. 12 కేంద్రాల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో 2,216 మంది విద్యార్థులకు ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. 2,208 మంది పరీక్ష రాశారు. పదో తరగతి పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థుల చేతివాచీలను అనుమతించ లేదు. దీంతో స్మార్ట్, సాధారణ వాచీలను కూడా విద్యార్థులు భద్రపరచుకోలేకపోయారు. దీంతో కొందరి చేతివాచీలు కనిపించకుండా పోయాయి. మరి కొందరు పరీక్ష ముగిసిన తర్వాత పాఠశాలలో వాచీలను మరచిపోయి వెళ్లిపోయారు. పరీక్షలకు చేతివాచీలను అనుమతించబోమని, అందువల్ల తీసుకురావద్దని నిర్వాహకులు తెలిపారు.

ఆనందపురం : మండలంలోని ఐదు కేంద్రాల్లో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎంఈవో అమృత బాలామణి చెప్పారు. శొంఠ్యాం పరీక్షా కేంద్రంలో ఇద్దరు, ఆనందపురం బీ కేంద్రంలో ఐదుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఆమె తెలిపారు. ఎక్కడా అవకతవకలు జరగకుండా తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని చెప్పారు.

భీమునిపట్నం: భీమిలి మూడో వార్డు పరిధిలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో ఉదయం 8 గంటల నుంచే ఆయా కేంద్రాలకు విద్యార్థులు, వారి తల్లితండ్రులు హాజరయ్యారు. పరీక్షకు అర గంట ముందు విద్యార్థులంతా తమకు కేటాయించిన గదుల్లోకి చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతోపాటు అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.



మద్ది హైస్కూల్‌లో పరీక్ష రాసేందుకు దివ్యాంగుడిని తీసుకొస్తున్న తండ్రి



చంద్రంపాలెం హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రం నుంచి వెలుపలకు వస్తున్న విద్యార్థులు

పద్మనాభం: మండలంలో మొదటి రోజు తెలుగు పరీక్షకు సోమవారం ఆరుగురు విద్యార్థులు గైర్హాజయ్యారు. 763 మందికి 757 మంది హాజరయ్యారు. మద్ది, రెడ్డిపల్లి, పద్మనాభం, ఆర్.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తల్లిదండ్రుల సాయంతో దివ్యాంగులు కేంద్రాలకు చేరుకున్నారు. ఎంఈవో ఎం.శివరాణి కేంద్రాలను సందర్శించారు.

పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో జరుగుతున్న ఓపెన్ టెన్త్ పరీక్షకు 16 మంది గైర్హాజరయ్యారు. 160 మందికి 144 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

పద్మనాభం: పదో తరగతి పరీక్ష రాయడానికి వస్తున్న ఒక విద్యార్థికి రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. భీమునిపట్నం మండలం మజ్జిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.చరణ్‌తేజను పరీక్ష రాయడానికి పద్మనాభం మండలం మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బైక్‌పై వేరే వ్యక్తి తీసుకొస్తున్నాడు. వీరు మజ్జిపేట సమీపంలోకి రాగానే బైక్ స్కిడ్ అవడంతో పడిపోయారు. ఈ సంఘటనలో చరణ్‌తేజ ఎడమ చేతికి గాయాలవడంతో వాచిపోయింది. కేంద్రానికి చేరుకున్న చరణ్ తేజ గాయాలతో ఇబ్బంది పడడం గమనించిన ఎంపీపీ కంటుబోతు రాంబాబు తన కారులో వైద్యుని వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి తిరిగి కేంద్రం వద్దకు తీసుకొచ్చారు.

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 12 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 2 కేంద్రాల్లో సుమారు 600 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొదటి రోజు ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు.



ఆలస్యం కావడంతో చంద్రంపాలెం హైస్కూల్‌కు పరుగు తీస్తున్న విద్యార్థి



పద్మనాభం హైస్కూల్‌లో పరీక్ష రాసేందుకు సిద్ధంగా విద్యార్థులు



తాళ్లవలస పరీక్ష కేంద్రంలో విద్యార్థులు మరిచిపోయిన చేతివాచీలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి చరణ్ తేజ

బైబై బేబీ రిడ్లేస్



ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న కార్పొరేటర్ కొండబాబు, తదితరులు

కొమ్మాది: అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు సఫలమవుతున్నాయి. వాటి గుడ్లను సేకరించి, ప్రత్యేకంగా పొదిగించి పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టిన అద్భుత దృశ్యం సోమవారం ఆవిష్కృతమయ్యింది. బుల్లిబుల్లి తాబేళ్లు బుడిబుడి అడుగులు వేసుకుంటూ సాగరం వైపు సాగే దృశ్యాలు ప్రతి ఒక్కరికీ కనువిందు చేశాయి. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ తీరంలో 550 ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, అటవీశాఖ అధికారులు సముద్రంలోకి విడిచిపెట్టారు. పర్యావరణ ప్రేమికులు ఈ దృశ్యాన్ని చూసి పరవశించిపోయారు. బైబై బేబీ రిడ్లేస్ అంటూ తాబేళ్లకు వీడ్కోలు పలికారు. జిల్లాలో సముద్ర తీర ప్రాంతాలు ఆలివ్ రిడ్లే సంతతికి నిలయంగా నిలుస్తున్నాయి. వీటి సంరక్షణ కోసం ఆర్‌కే బీచ్, జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, చేపలుప్పాడ, పెదనాగమయ్య పాలెం ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేరుగు చిన్నారావు, పుక్కళ్ల సుందరరావు, అప్పలరాజు, గరికిన ఎల్లయ్య, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పాత డీలర్‌నే కొనసాగించాలని ఉత్తర్వులు



సంతబయలులోని 15వ నంబరు రేషన్ డిపో

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతబయలు ప్రదేశంలోని 15వ నంబరు రేషన్‌డిపోను పాత డీలర్‌తోనే కొనసాగించాలని సంబంధిత అధికారులు, ప్రతివాదులకు హైకోర్టు ఆర్డర్ జారీ చేసింది. దీనికి సంబంధించిన వివరాల ప్రకారం... 2023 ఫిబ్రవరి వరకు సంతబయలు ప్రదేశంలోని 15వ నంబర్ రేషన్‌డిపోను ఉప్పల చిన వెంకటరమణ నిర్వహించేవారు. డిపో నిర్వహిస్తున్న భవనానికి సంబంధించిన హక్కులపై డీలర్, అతని కుమారుడు రమేష్ బాబుకు న్యాయస్థానంలో తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ అనధికారంగా నిర్వహిస్తున్న డిపో అధికారతను రద్దు చేసి మార్చి మొదటి వారంలో మరొకరిని ఇన్‌చార్జిగా నియమించారు. దీనిపై డీలర్ వెంకటరమణ హైకోర్టును ఆశ్రయించగా పాత డిపో ప్రదేశంలోనే పాత డీలర్‌తో కొనసాగించాలని ఆర్డర్ జారీ చేసింది. ఈ మేరకు వెంకటరమణ ఏప్రిల్ నెలకు సంబంధించిన రేషన్ సరకులు సంతబయలు ప్రదేశంలోని పాత డిపోకు సరఫరా చేయాలని కోర్టు ఉత్తర్వుల ప్రకారం పౌరసరఫరాల శాఖ అధికారులను కోరారు.

అవకతవకలపై దర్యాప్తునకు డిమాండ్



జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

పద్మనాభం: ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపించి, భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ విశాఖపట్నం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. పద్మనాభం మండలం గంధవరం, కొవ్వాడ, విజయనగరం జిల్లా అలమండ పంచాయతీ నారాయణపురం గ్రామాలకు చెందిన రైతులు తాము సర్వే నంబర్లు 258 నుంచి 352/2 వరకు 50 ఏళ్ల నుంచి మామిడి, జీడి మామిడి, టేకు తోటలు పెంచుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన తాము నిరుపేదలమని, తమ నుంచి ప్రభుత్వం జగనన్న కాలనీ కోసం ల్యాండ్ పూలింగ్‌లో భూములు తీసుకుందని తెలిపారు. నిబంధనల ప్రకారం డీ ఫారం భూములకు ఎకరాలకు తొమ్మిది వందల గజాలు, సాగులో ఉన్న భూమికి ఎకరాకు 450 చదరపు గజాలు కొంత మందికి ఇచ్చారని తెలిపారు. కొంత మందికి ఒక గజం భూమి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇదే భూమిలో తక్కువ భూమున్న గంధవరం సర్పంచ్‌కు వేరొక చోట హౌస్ సైట్ కింద ఎక్కువ భూమిచ్చారని తెలిపారు. అంగుళం స్థలం లేని అనంతవరం గ్రామ సర్పంచ్ భర్త గొర్రిపాటి పెద ఎర్నాయుడుకు ఈ సైట్ పేరు మీద వేరేచోట హౌస్ సైట్ ఇచ్చారని, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు తాను, తన కుటుంబీల పేరున హౌస్ సైట్‌లు తీసుకున్నారని ఆరోపించారు. ముందుగా వీరు పద్మనాభం తహసీల్దార్ టి.శ్రీవల్లీకి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

పైడితల్లమ్మ అనుపోత్సవం నేడు



పైడితల్లమ్మ అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద, నారాయణరాజుపేట, లక్ష్మీపురం, దాకమర్రి, భోగాపురం మండలంలోని రాజాపులోవ పంచాయతీలకు చెందిన 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ అనుపోత్సవాలు మంగళవారం జరుగుతాయి. ఈ సందర్భంగా కృష్ణంరాజుపేట, విజయరాంపురం, కరగానిపేట, మద్దిలపేట, దాకమర్రి, ముద్దాడపేట, శింగనబంద గ్రామాల్లో నేల వేషాలు, బాణసంచా ఏర్పాటు చేశారు.

ఫుట్‌పాత్‌పై శ్లాబు శిథిలంతో ప్రమాదాలు



మధురవాడ బస్టాప్ సమీపంలో ఫుట్‌పాత్‌పై పగిలిన శ్లాబు

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 కేంద్రం మధురవాడ పరిసర ప్రాంతాలైన కొమ్మాది, మధురవాడ, చంద్రంపాలెం, కార్‌షెడ్, క్రికెట్ స్టేడియం తదితర చోట్ల హైవే సర్వీసు రోడ్డును ఆనుకుని ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన శ్లాబు చాలా చోట్ల పూర్తిగా శిథిలమైపోయింది. ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బందిగా మారడమే కాకుండా ప్రమాదకరంగా తయారయ్యింది. దీనివల్ల పాదచారులతో పాటు పిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌పాత్‌గా ఉపయోగించాల్సి భారీ కాలువపై ఏర్పాటు చేసిన శ్లాబులు శిథిలం కావడం, అంతంత మాత్రంగా ఉన్న ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన తోపుడు బళ్లు, దుకాణాలు, ఇతర వ్యాపారాలతో నడవడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఇక చంద్రంపాలెం హైస్కూలు, మధురవాడ డైలీ మార్కెట్, రైతు బజార్ వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి.

– బోర.ఎర్రయ్యరెడ్డి, పరదేశిపాలెం

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పరవాడ: మండలంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం విస్తృత ప్రచారం చేశారు. ముత్యాలమ్మపాలెంలో సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు మాట్లాడుతూ ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం నిర్వహించడం సంతోషించాల్సిన విషయమన్నారు. మాజీ ఎంపీటీసీ అమ్మోరు, లంకెలపాలెం పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, అక్షయ్, రాము, రమణ, నాయుడు, మీనా, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రతీ గడపకూ వైఎస్సార్ సీపీ గృహ సారథులు



సచివాలయ కన్వీనర్లకు కిట్‌లు అందజేస్తున్న పోతిన శ్రీనివాసరావు తదితరులు

మధురవాడ: వైఎస్సార్‌సీపీ గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జగనన్న పాలనను వివరించాలని పార్టీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు సూచించారు. సోమవారం సాయంత్రం పిలకవానిపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతా సమిష్టిగా పనిచేసేందుకు సిద్ధం కావాలని సూచించారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజల్లో ఎండగట్టేందుకు మరింత కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కన్వీనర్‌లకు స్టిక్కర్లు, ఇతర సామగ్రితో కూడిన కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, వివిధ విభాగాల నాయకులు కుడితి రామారావు, సీహెచ్.రజిని, పిళ్లా సూరిబాబు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెంగ్ర అప్పన్న, బంగారు ప్రకాశ్, గోపి, రామిరెడ్డి, శ్రీదేవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌ల క్యాబిన్ తొలగింపు



బోయిపాలెం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసుల క్యాబిన్ (ఫైల్)



క్యాబిన్ తొలగించడంతో ఎండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్

బోయిపాలెం జంక్షన్‌లో ఘటన

ఆనందపురం : మండలంలోని బోయిపాలెం జంక్షన్‌లో రోడ్డు పక్కన ట్రాఫిక్ పోలీసుల విధి నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన క్యాబిన్‌ను రాత్రి వేళ కొంతమంది మాయం చేశారు. తొలగించి కొద్ది దూరంలో తుప్పల్లో పడేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సోమవారం విచారణ జరిపారు. నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు. జంక్షన్‌కు ఆనుకొని ఉన్న రోడ్డు మార్జిన్‌లో కొత్తగా వ్యాపారాలు ప్రారంభించారు. వారి వ్యాపారాలకు క్యాబిన్ అడ్డంకిగా ఉండడంతో వ్యాపారులే తొలగించారనే ప్రచారం జరుగుతోంది. దీంతో అక్కడ ట్రాఫిక్ పోలీసులు నడిరోడ్డుపైనే విధులు నిర్వహిస్తున్నారు. ఆనందపురం, కాపులుప్పాడ, విశాఖపట్నం వెళ్లే రోడ్ల కలయికతో ఏర్పడిన బోయిపాలెం జంక్షన్‌లో మూడేళ్ల క్రితం ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆనందపురం నుంచి కాపులుప్పాడ వెళ్లే రోడ్డు మలుపు వద్ద క్యాబిన్ ఏర్పాటు చేయగా ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా సోమవారం విధులకు వెళ్లిన ట్రాఫిక్ పోలీసులకు అక్కడ క్యాబిన్ కనిపించలేదు. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్, సిబ్బంది విచారణ జరపగా కాపులుప్పాడ వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన క్యాబిన్ పడేసి ఉండడాన్ని గమనించారు. ఆ పరిసర ప్రాంతాల్లో గల సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తున్నారు. అలాగే కొత్తగా వ్యాపారులు ప్రారంభించిన ఆ ప్రాంతం ఎవరి పరిధిలోనిది అనే విషయమై జాతీయ రహదారుల సంస్థ అధికారులతో పోలీసులు చర్చిస్తున్నారు. ఈ విషయమై ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ మాట్లాడుతూ క్యాబిన్ తొలగించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పలువురికి సీమంతాలు



తాటితూరులో సీమంతాలు చేస్తున్న అధికారులు, పంచాయతీ పెద్దలు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ శిరిగుడి సంతోషి ఆధ్వర్యంలో గర్భిణులకు సోమవారం సీమంతాలు చేశారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై వివరించారు. పంచాయతీలో 18 ఏళ్ల ఆశా వర్కర్‌గా సేవలు అందించిన నీలాపు అప్పలకొండను గ్రామపెద్దలు సత్కరించారు. ఆమె చేసిన సేవలు పంచాయతీ ప్రజలు గుర్తించుకుంటారని సర్పంచ్ సంతోషి కొనియాడారు. కార్యక్రమాలలో ఉప సర్పంచ్ కొయ్య శ్రీనివాసరెడ్డి, గ్రామపెద్దలు ఉండబట్ల చిన్నారావు, దుంపల ప్రభాకర్, పల్లంటి శ్యామ్‌సుందర్, మద్దిల గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై శ్లాబుల ఏర్పాటుకు వినతి



భీమిలి జోనల్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్



మధురవాడ జోనల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

మధురవాడ: జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లపై చాలా చోట్ల శ్లాబు పాడైపోవడంతో పాదచారులు, పిల్లలు, వృద్ధులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సరిచేయడానికి తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో సూపరింటెండెంట్ అప్పలరాజుకు వినతిపత్రం అందించారు. మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద చిన్నపాటి వర్షం కురిసినా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చంద్రంపాలెం హైస్కూలు వద్ద అండర్ పాస్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని తాతపూడి ప్రదీప్ కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోతిన పైడిరాజు తదితరులు కోరారు. జోన్ పరిధిలోని 9 వార్డుల్లోని వివిధ ప్రాంతాల నుంచి 17 అర్జీలు వచ్చాయి. ఇంజినీరింగ్ వర్క్స్ విభాగానికి 7, ప్రజారోగ్యం 2, పట్టణ ప్రణాళిక విభాగానికి 3, ఎలక్ట్రికల్ సమస్యలపై 3, రెవెన్యూ సమస్యలపై 2 ఫిర్యాదులు అందాయి. ఎండాడ వైఎల్‌పీ వుడా లే అవుట్ అపెక్స్ ఆర్ఏఆర్ అపార్ట్‌మెంట్ చుట్టుపక్కల మురుగునీరు ఉండిపోవడంతో ఇబ్బందులు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణం కోసం గాయత్రినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఏడు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రెండు, ఇంజినీరింగ్ విభాగానికి మూడు, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాలకు ఒక్కొక్క వినతి వచ్చింది. ఈ వినతులను పరిశీలించి సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

రేవిడి పీహెచ్‌సీ కార్యాలయానికి నూతన శోభ



ఆధునికీకరణతో నూతన శోభను సంతరించుకున్న రేవిడి పీహెచ్‌సీ కార్యాలయం



ఆయుర్వేద ఆస్పత్రికి నూతనంగా నిర్మించిన గది

ఆయుర్వేద ఆస్పత్రికి గది నిర్మాణం

పద్మనాభం: మండలంలోని రేవిడి పీహెచ్‌సీ కార్యాలయాన్ని ఆధునికీకరించారు. దీంతో నూతన శోభ సంతరించుకుంది. పాత కార్యాలయం వర్షాలకు కారిపోతుండేది. దీనివల్ల సిబ్బంది ఇబ్బంది పడేవారు. శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు ఆటంకం ఏర్పడేది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలతో ఎంపీపీ కంటుబోతు రాంబాబు చొరవ చూపి మండల పరిషత్ నిధులు రూ.13లక్షలతో కార్యాలయాన్ని ఆధునికీకరించారు. సిబ్బంది కూర్చునేందుకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి హాళ్లు నిర్మించారు.

మందులు నిల్వ చేసుకోవడానికి గది నిర్మించారు. కార్యాలయానికి అనుసంధానంగా ఆయుర్వేద ఆస్పత్రికి ప్రత్యేక గది నిర్మించారు. ఇప్పటి వరకు ఆయుర్వేద ఆస్పత్రిని శిథిలావస్థలో ఉన్న ఏఎన్ఎం క్వార్టర్‌లో నిర్వహిస్తున్నారు. అది వర్షాలకు కారిపోతుండడంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం ఈ ఆస్పత్రికి సొంత భవనం నిర్మాణంలో నిర్లక్ష్యం వహించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయుర్వేద ఆస్పత్రికి సొంత భవనం సమకూరింది. మండల పరిషత్ నిధులు రూ.4లక్షలతో పీహెచ్‌సీ గేటుకు అనుసంధానంగా ఆయుర్వేద ఆస్పత్రి, పీహెచ్‌సీ కార్యాలయం ముందు నుంచి ప్రధాన ద్వారం వరకు సిమెంటు రోడ్డు వేశారు. యూ ఆకారంలో నిర్మించిన ఈ రోడ్డు ఆకట్టుకుంటోంది.

